# తుమ్మ ముళ్ళు

శ్రీ 'విజయ – రాఘవ'

★

(గతసంచిక తరువాయి)

సరోజిని బ్రహ్మాజీరావుకి గారాబపు పట్టి. తల్లి చనిపోయిన నాటినుంచి బ్రహ్మాజీరావే అన్నిరంగాల్లో సమయోచితపాత్రను ధరిస్తూ, ఆమెను ఆదుకుంటూ కాపురానికి పంపాడు. మల్లిఖార్జునరావు బ్రహ్మాజీరావుకి నాల్గో అల్లుడు; మనిషి నలుపైన బుద్ధినలుపు గాదు — చాల సహనపరుడు. శాంతి స్వభావి. స్కూలు ఫైనలువరకూ చదివి వూరుకొన్నాడు. కోలవెన్ను స్వగ్రామం. చాలా గౌరవంగా బ్రతుకుతున్న కుటుంబంలో పుట్టి పెరిగినవాడు. మల్లిఖార్జునరావంటి వ్యక్తి బ్రహ్మాజీరావుకి అల్లుడవటం, మరయేనాడో బ్రహ్మాజీరావు చేసుకొన్న పూర్వ పుణ్యఫలమే. చాలా అదృష్టవంతుడుకూడా. కాని బ్రహ్మాజీరావు యీ అదృష్టాన్ని యీనాటివరకు వినియోగించుకోలేక పోతున్నాడంటే; అది యెవరి కర్మో ఆలోచించాలన్నా తట్టని సమస్య. పల్లెత్తుమాట పడడు—పల్లెత్తి మాట అనని వ్యక్తి మల్లికార్జునరావు. సరోజిని పెళ్ళయిన తర్వాతే బ్రహ్మాజీరావుకి భార్యా వియోగం కలిగింది. సుబ్బారావు మాత్రం అత్తగారి చావుకి అలివేలుమంగని చూడటానికికూడా పంపలేదు. మిగతావాళ్ళంతా రావడంలో ఆశ్చర్యమేముంది!

అప్పటికి అరుంధతి కాపరానికి రానేవచ్చింది. రామకృష్ణ, అరుంధతి సంసారంలో యిమిడివున్నట్లయితే బ్రహ్మాజీరావు చాలా సుఖపడేవాడు. కాని తనేదో సోమయాజి నిష్ఠలన్నీ యీనాడు చూపాలని అనుకొంటే, ఆ సంసారంలో అటువంటివేమీ ఆటలాడించడానికి అనుగుణ్యమైన తావుకాదు. అయినవరకు యింత వండుకుతినడం, వేళకు యెవరైనా వస్తే వున్నదిపెట్టి, గౌరవంగా చూడటంతప్ప మరే అలవాటు అయిలంలో జరుగుతున్నట్లు కనబడదు. బ్రహ్మాజీరావు చీటికిమాటికి చిందులు తొక్కుతూ రామకృష్ణ సంసారం గురించి తనలోతాను వితర్కించుకొనేవాడు. "కావాలని పెంచుకొన్న రామకృష్ణ సంసారంలోంచి తను ఈనాడు వేరుబడి, కాపురానికి వెళ్ళనున్న సరోజినిని తనకు వండిపెడుతూవుండమని అర్థించడమూ, అలాగే కాలం కడతేర్చుకోవాలని అనుకోవడమూ, యెంతవరకు ప్రపంచానికి నచ్చినట్లుంటుంది." అని కొన్నాళ్లు భావించాడు. రామకృష్ణ—అరుంధతులు మర్యాదగా బ్రహ్మాజీరావుని తమ సంసారంలో యిమిడివుండమని కోరారు. కాని, మంచిమాటలు మనస్సుకెక్కే స్థితి, మర్యాద నిలుపుకుందామనే కాంక్ష, హాయిగా బ్రతుకుదామనే జ్ఞానం శూన్యం కావడంవల్ల బుద్ధి పెడదార్లు తొక్కింది. ఏనాడైతే బ్రహ్మాజీరావు ఆ సంసారంలో యిమిడివుంటానికి తిరస్కారభావం వెలిబుచ్చాడో, ఆనాటినుంచీ కొడుకు, కోడలుకూడా ఆయనకు సంబంధించిన యే విషయాల్లోకూడా జోక్యం కలిగించుకోవడం పూర్తిగా మానివేశారు. సరోజిని వండుతూపడుంటే, తింటూ కాలం వెళ్ళబుచ్చుతున్నాడు. "ఎందుకింత వగకు మళ్ళా అత్తవారింటికి అడుగుపెట్టలేదు?" అనే ప్రశ్న వారికి, అయినవాళ్ళల్లోనూ కలగనే కలిగింది.

## 6

మల్లికార్జునరావు బందరులో సెకెండుగ్రేడు ట్రైనింగు చదువుతున్నాడప్పుడు. సరోజిని గొల్లపల్లి నుంచి కదిలే పరిస్థితిలో లేదు. ట్రైనింగు అయ్యేంత

వరకు, పోనీ అక్కడేవుంటే మంచిదని, మల్లికార్జునరావుకూడా పెద్దగా 'సరోజినిని గురించి ఆలోచించలేదు.

ఒకనాడు రాత్రి హఠాత్తుగా పన్నెండు గంటలప్పుడు యిద్దరు పోలీసుల్తో ఒక హెడ్ కానిస్టేబిల్ మల్లికార్జునరావు రూంకివచ్చారు. అందరూ నిద్రపోతున్నారు. తలుపు తట్టగానే మల్లిఖార్జునరావు స్నేహితుడు తలుపు తీసాడు. ఇంత రాత్రిప్పుడు, యెటూగానివేళ యీ పోలీసువాళ్ళదాడి యేమిటని, స్నేహితుడు గాబరాపడ్డాడు. నెమ్మదిగా మల్లికార్జునరావునికూడా లేపాడు.

హెడ్ కానిస్టేబిల్ చాలా మంచివాడు. అదృష్టంవల్ల బాగా తెలిసినవాడు. మల్లిఖార్జునరావు మెల్లగా పక్కమీదనుంచి లేస్తూ హెడ్ కానిస్టేబిల్‌ని చూసి దిగ్భ్రాంతుడయ్యాడు. కూచోమని మర్యాదచేసాడు. కాసేపటికి ఒకరికొకరు పరామర్శించుకొన్నారు. తరువాత కానిస్టేబిల్ నెమ్మదిగా లేస్తూ — "మల్లిఖార్జునరావుగారూ! యేమనుకోకుండావుంటే. ఒకసారి బయటికి వొస్తారా!" — అన్నాడు.

మల్లిఖార్జునరావు వంకిన తగిలించిన చొక్కా తొంటికి తగిలించి, పెట్టెమీదవున్న తాజ్ మహల్ బీడీ కట్టని, అగ్గిపెట్టెని జేబులో పెట్టుకొని, లుంగీతోనే బయటకొచ్చాడు. పోలీసువాళ్ళిద్దరూ రూంలోకూర్చొని సినిమా పుస్తకాలు తిరుగవేస్తున్నారు. హెడ్ కానిస్టేబిల్ మల్లిఖార్జునరావు యిద్దరూ రూం విడిచి యిరవైగజాల దూరంలోకి వెళ్ళి నిలుచున్నారు.

ఇద్దరూ బీడీలు ముట్టించారు. హెడ్ కానిస్టేబిల్ నెత్తిమీద టోపీ తీస్తూ—

"మీరు చాలా గౌరవంగా బ్రతుకుతున్నవారు. కర్మం కాలినప్పుడు మంచికూడా చెడు అనిపించుకొంటుంది. నిజానిజాలు పరిష్కరించడం ప్రస్తుతం మనం వూహించినా తట్టని విషయం. నేనుకూడా మొదట్లో నమ్మలేదు సుమా! కాని నా డ్యూటీ యేమిటో నేను నిర్వర్తించాలిగదా!" — అంటుంటే మల్లిఖార్జునరావు పాదాలక్రింద భూమి నమ్మినవాళ్ళెవరో త్రవ్వుతున్నట్లుగా వుంది. దగ్గుత్తిగావున్న కంఠాన్ని సారించి— "ఏమిటో చెపుతున్నారు. కాని అర్థం కాకుండా వుంది" — అన్నాడు.

"మళ్ళా చెప్పమంటారా! యీసారి వున్న దున్నట్లుగా చెబుతాను" — అన్నాడు కానిస్టేబుల్.

"అయితే కూర్చొని చెప్పకండా"మని యిద్దరూ కూర్చొన్నారు.

హెడ్ కానిస్టేబుల్. నడుంకి వున్న బెల్టుతీస్తూ—

"గొల్లపల్లి మీఅత్తవారి వూరుకదూ! యీమధ్య అక్కడ ఒక దొంగతనం జరిగింది. బ్రహ్మాజీరావుగారి యింటిముందున్న కమ్మవారియింట్లోపోయిన చీరెలు—మరికొన్ని నగలూమాత్రం బ్రహ్మాజీరావుగారింట్లో దొరికినాయి. బ్రహ్మాజీరావుగారి అమ్మాయి సరోజిని యీ దొంగతనానికి కారకురాలని, రూఢిగా తెలుస్తోంది. పోయిన వస్తువులు వారింట్లోనే దొరకడం వల్లనూ, సరోజినిగారు మీకు భార్యగారు కావడం వల్ల మిమ్ముల్నికూడా యీ సందర్భంలో ఆ మాకీ తీయవలసిన పనివుంది. దయచేసి మీరేమనుకోకుండా వుంటే, మీ రూం సోదాచేసుకొని వెళ్తాం. మరి అనుమతికోరుతున్నా" అని గౌరవంగా అడిగేటప్పటికి—మల్లిఖార్జునరావు నమ్ముకున్న పాదాల క్రింద భూమిని త్రవ్వగా యేర్పడినగోతిలో పడ్డాడు. తలెత్తి శూన్యాకాసంలోకి తొంగిచూస్తూ విషయంగురించి ఆలోచిద్దామనుకుంటే బలంగా, మెదలేవకుండా ఒక గట్టివస్తువేదో వంచేస్తోంది. శరీరాన్నంతటిని తుమ్మముళ్ళతో గుచ్చినట్టుగా వుంది. ఒక్క నిట్టూర్పు బరువుగా వదులుడూ —

"అయితేరండి! మీ పని మీరు పూర్తిచేసుకొని వెళ్ళండి"— అని మాత్రం అనగల్గాడు.

ఇద్దరూలేచి రూంకివచ్చి, వెతకడం ప్రారంభించారు. గంటా గంటన్నర వెతికిం తరువాత కానిస్టేబుల్ మందహాసంగా—

(సశేషము)